క్లుప్తంగా

ఎస్ఈసీ మెంబరుగా జెడ్పీటీసీ సభ్యుడు


జగదీశ్వరరెడ్డి

జూపాడుబంగ్లా: వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఎస్ఈసీ)మెంబరుగా జూపాడుబంగ్లా జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్‌ల సహకారంతో పార్టీ తనను గుర్తించి ఎస్ఈసీ మెంబరుగా నియమించినందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి కేటాయించడంతో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


విరాళం దాతలకు బాండు అందిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన యలమంచిలి సాంబశివరావు, సుజాత కుటుంబ సభ్యులు రూ.1,00,500 విరాళం అందించారు. దాతలకు స్వామి వారి ప్రసాదాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, సూపరింటెండెంట్ ఎం.నీలకంఠేశ్వరరాజు పాల్గొన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ


స్వామి అమ్మ వార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి శుక్రవారం సందర్భంగా దేవస్థాన అర్చకులు ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మల్లన్నను దర్శించుకున్న దేవదాయ శాఖ కార్యదర్శి


శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న దేవదాయ శాఖ కార్యదర్శి

శ్రీశైలం టెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మ వార్లను దేవదాయ శాఖ కార్యదర్శి డాక్టర్ హరిజవహర్‌లాల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామి వారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అంతకు ముందు డాక్టర్ హరిజవహర్‌లాల్‌కు ఆయల అధికారులు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం స్వామి వారి శేషావస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు, జ్ఞాపికను అందించి సత్కరించారు.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత


ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

వెలుగోడు: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని వెలుగోడు రేంజ్ ఫారెస్ట్ ఇన్‌చార్జ్ అధికారి ఎస్ జెడ్ ఏ తాహేర్ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక లిటిల్ ఏంజిల్స్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు అడవులు, వన్య ప్రాణుల రక్షణ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడటం చట్ట రీత్యా నేరమన్నారు. అడవులను, వన్యప్రాణులను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

కేవీపీఎస్ జెండా ఆవిష్కరణ

పాములపాడు: కుల వివక్షత వ్యతిరేక పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్సీ కాలనీలోని ఇందిరమ్మ విగ్రహం వద్ద సమితి నాయకులు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి మేకల రాజు, కౌలు రైతు సంఘం జిల్లా సహ కార్యదర్శి డి సామన్న, జిల్లా నాయకులు టి వెంకటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విజయదశమి వేడుకలు

- శమీవృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు
- శరన్నవరాత్రుల్లో పూజలందుకుని నిమజ్జనానికి తరలిన అమ్మవారి

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు విజయదశమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం తాటిపాడు, తర్తూరు, మండ్లెం, తంగడంచ, జూపాడుబంగ్లా, పారుమంచాల, తూడిచెర్ల, 80బన్నూరు, తరిగోపుల, భాస్కరాపురం తదితర గ్రామాల్లో శమీవృక్షాలకు పూజలు నిర్వహించి ఏడాది పాటు తమకు విజయాలు చేకూర్చాలని వేడుకున్నారు. స్వామివారి పల్లకీని గ్రామాల్లోని పురవీధుల్లో భాజాభజంత్రీలతో ఊరేగించారు. తొమ్మిదిరోజులపాటు భక్తిశ్రద్ధలతో దేవీనవరాత్రి ఉత్సవాలు జరుపుకున్న భక్తులు గురువారం అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై కొలువుంచి ఊరేగింపుగా కేసీ కాల్వలకు తరలించి నిమజ్జనం చేశారు.


స్వామివారి పల్లకీతో పారుమంచాలలో శమీవృక్షం వద్దకు వెళ్తున్న భక్తులు


ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో నిమజ్జనానికి తీసుకెళ్తున్న అమ్మవారి ప్రతిమ

పాములపాడు: మండలంలో ప్రజలు విజయదశమి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి ప్రజలు ఆయా గ్రామాల్లోని ఆవాలయాల్లో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. సాయంత్రం శమీ వృక్షం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి శమీ పత్రాలను సేకరించుకుని ఆలయాల్లో స్వామివారి సమర్పించి దర్శనం చేసుకున్నారు.


పాములపాడులో శమీ వృక్షం వద్ద పత్రాలను సేకరిస్తున్న ప్రజలు

కొత్తపల్లి: మండలంలో దసర శరన్నవరాత్రి వేడుకలు ముగిశాయి. ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. చివరి రోజు కొలనుభారతి అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామాల్లోని ప్రజలు కుటుంబ సమేతంగా దేవతామూర్తులకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జమ్మిచెట్ల వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. దేవతా మూర్తుల విగ్రహాలను పల్లకీలో కొలువుంచి పురోహితుల ఆధ్వర్యంలో పురవీధుల వెంట ఊరేగింపు చేశారు.


గువ్వలకుంట్ల సమీపంలో జమ్మిచెట్టుకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఆత్మకూరు: గ్రామాల్లో దసరా పండగ వేడుకల ను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే భక్తులు ఆంజనేయస్వామి, దుర్గామాత, పార్వతీ, పరమేశ్వరుడి ఆలయాలకు వెళ్లి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పిల్లాపాపలతో పండగను ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పండగరోజున వాసవీ కన్యకా పరమేశ్వరి మాత విజయలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.


ఆత్మకూరులో పూజలందుకున్న విజయలక్ష్మి అమ్మవారు


వెలుగోడులో రాజేశ్వరి అలంకరణలో వాసవీ మాత

వెలుగోడు: మండలంలో దసరా పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పట్టణంలోని వాసవీ మాత ఆలయం, వేల్పనూరులో అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చివరి రోజు వాసవీ మాత రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శమీ వృక్షం వద్ద పూజలు నిర్వహించి పెద్దలకు శమీ ఆకు ఇచ్చి ఆశీర్వాదం పొందారు. వెలుగోడు కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ముగింపు సందర్భంగా వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. లలితా మహిళా మణి గ్రూప్ సభ్యుల కోలాటం, కాంతారా వేషధారణలు ఆకట్టుకున్నాయి.


గ్రామోత్సవంలో కోలాటం వేస్తున్న మహిళలు

మహానంది: మహానందిలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ఉప ప్రధాన అర్చకులు మూలస్థానం శివశంకరశర్మ, ముఖ్య అర్చకులు ప్రకాశం శర్మ, మణికంఠశర్మ, అర్చకులు రఘుశర్మ, రుత్వికులు ఆధ్వర్యంలో ముగిశాయి. చివరి రోజు కామేశ్వరీదేవి నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈశ్వర్‌నగర్ కాలనీలోని శమీ వృక్షం వద్ద పూజల అనంతరం స్వామి, అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. దసరా వేషధారణలు ఆకట్టుకున్నాయి. నంద్యాలలోని బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయానికి వెళ్లిన మహానందీశ్వరస్వామి దంపతులు మహానందికి చేరుకున్నారు. స్థానిక గరుడనందీశ్వర స్వామి ఆలయం వద్ద విశేష పూజల అనంతరం తిరిగి యాగశాలకు చేర్చారు.


శమీ వృక్షం వద్ద పూజలు చేస్తున్న వేదపండితులు

భూముల రీసర్వే పకడ్బందీగా చేయండి


సమగ్ర భూ రీసర్వేను ప్రారంభిపజేస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్

జూపాడుబంగ్లా: రైతుల భూములను పకడ్బందీగా రీ సర్వేచేసి సరిహద్దులు చూపించాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ సర్వే సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం తాటిపాడు గ్రామంలోని 35 బొల్లవరం రెవెన్యూ పరిధిలో సమగ్ర భూ రీసర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ ప్రారంభించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. భూములు సర్వే చేయటానికి ముందు సంబంధిత రైతులకు ఫారం-19 నోటీసులివ్వటంతో పాటు వాట్సాప్ మెసేజ్, ఫోన్ కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. రైతులను వారి పొలాల వద్దకు రప్పించి, వారి వద్దనున్న డాక్యుమెంట్లను పరిశీలించిన అనంతరం సర్వే చేయాలన్నారు. రైతులు కూడా సర్వే అధికారులకు సహకరించాలని, ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా పొలాల్లో మొక్కజొన్న పంటలున్నందున పంట నూర్పిళ్ల అనంతరం సర్వే చేయాలని రైతులు కోరగా అందుకు ఆయన అంగీకరించారు. రీసర్వే డీటీ నాగన్న, మండల సర్వేయర్ అతీఫ్, వీఆర్వో బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సేవలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి

మహానంది: మహానందీశ్వరుడి సేవలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పిటి ఆశ గురువారం కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అంతకుముందు వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారి మెమొంటో అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టతను వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని న్యాయమూర్తికి వివరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదిక పై ప్రకాశం జిల్లాకు చెందిన చల్లా నాగేశ్వరమ్మ, బృందం వారిచే భక్తిరంజని కార్యక్రమం నిర్వహించారు. గణపతి ప్రార్థన, గణనాథం భజే, శంభో మహాదేవ, భో... శంభో, నమశ్శి వాయతే, శివ శివ శంకరా, నటరాజస్వామి, శివకీర్తనలను గీతాంజలి, నాగేశ్వరమ్మ, ఎ.మనోహర్ తదితరులు ఆలపించారు.

అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు: మండలంలోని బాపునంతపురం గ్రామ రైతుల పొలాలకు, దళితుల శ్మశాన వాటికకు వెళ్లడానికి అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సుధాకర్, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ అధికారులను కోరారు. శుక్రవారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గ్రామ రైతులు, దళితులతో కలిసి హైవే రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ హైవే -167 నిర్మాణంలో భాగంగా అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు ఆవులపాటి వెంకటేశ్వర్లు, స్వామిదాసు, ఎ.రాముడు, చంద్రశేఖర్, గోపిరెడ్డి, నాగిరెడ్డి, వెంకటరావు, భూపాల్, చంద్రన్న, కోటేశ్వరయ్య, నాగమ్మ, రవి, దేవభూషణం, సుబ్బయ్య, రత్నమ్మ పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి


రికార్డులను తనిఖీ చేస్తున్న డాక్టర్ లలిత

నందికొట్కూరు: ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు డాక్టర్లు అందుబాటులో ఉండాలని జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పటల్ సర్వీసెస్ డాక్టర్ లలిత అన్నారు. శుక్రవారం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను, మరుగుదొడ్లను పరిశీలించారు. సమస్యలను డాక్టరు షేక్ జక్కి అక్షానిని అడిగి తెలుసుకున్నారు.

అధికారులకు సహకరించాలి


పూజ చేస్తున్న అధికారులు

పాములపాడు: రీసర్వే విషయంలో రైతులు అధికారులకు సహకరించాలని తహసీల్దార్ సుభద్రమ్మ కోరారు. శుక్రవారం వేంపేట గ్రామంలో రీ సర్వే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వే సమయంలో రైతులు పట్టాదారు పాసు బుక్కు, వన్ బీ, అడంగల్ అధికారులకు చూపించాలన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ సుప్రియ, సర్వేయర్లు భాస్కర్, కలీముల్లా, సింగపూర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భూ సమస్యలకు రీ సర్వేతో చెక్


రీ సర్వే పనులు ప్రారంబిస్తున్న తహసీల్దార్

కొత్తపల్లి: రైతులకు భూ సమస్యలకు భూ రీ సర్వే ద్వారా చెక్ పెట్టనున్నట్లు తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. శుక్రవారం ఎదురుపాడు, గువ్వలకుంట్ల గ్రామాలలో భూ రీ సర్వే పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రోవర్ పరికరంతో భూములు కొలతలు వేయడం వల్ల భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తవన్నారు. ఆమె వెంట రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఎదురుపాడు సర్పంచు షేక్ నాజియా, వీఆర్వోలు చంద్రశేఖర్, అశోక్, రామసుబ్బయ్య, వీలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

గాంధీజీకి ఘన నివాళి

నందికొట్కూరు: జాతిపిత మహాత్మాగాంధీకి అధికారులు, ప్రజాసంఘాల నాయకులు ఘన నివాళులర్పించారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో, ప్రధాన రహదారిపై ఉన్న గాంధీ విగ్రహాలకు ఆయన జయంతి సందర్భంగా పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జయరామక్రిష్ణ తదితరులు పాల్గొని గాంధీజీ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ బేబి, ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బచ్చు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పగిద్యాల: గాంధీ జయంతిని ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జెడ్పీటీసీ పుల్యాల దివ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేంద్రకుమార్, డిప్యూటీ ఎంపీడీఓ అబ్దుల్ రహీం, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న పాల్గొన్నారు.

ఆత్మకూరు: జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోమిన్‌ముస్సీర్‌బాషా ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమలో ఆత్మకూరు రైతు భరోసా కమిటీ మాజీ చైర్మన్ బైరాపురం మహబూబ్‌బాషా, కవ్వా ఖాదర్, నాయకులు టైగర్ బాబు, ముసలమడుగు నవీసా, మోమిన్, మారుస్తా గారి ముర్తుజా, మంగలి సుబ్బరాయుడు, రజమత్ గారి రబ్బాని, సాదిక్, శేఖర్ రాజమద్ గారి ఇబ్రహీం, ముసలముడు రసూల్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో..

పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్‌చాంద్ బాషా ఆధ్వర్యంలో గాంధీ పార్కు వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సయ్యద్‌ఇబ్రహీం, ఎస్.వి.రామిరెడ్డి, పి.నూర్ మహమ్మద్, హుసేన్‌సామెబ్, రషీద్, జిల్లా నాయకులు చంద్రశేఖర్, ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, వెలుగోడు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మొయినుద్దీన్, హరినాథ్‌బాబు, శ్రీనివాసులు, రఫిక్, నరేష్, ఖాజా మొహిద్దీన్, మీర్, ఇబ్రహీం, అలామ్‌బాషా పాల్గొన్నారు.


కేజీ రోడ్డుపై గాంధీ విగ్రహం వద్ద నివాళలర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, సభ్యులు


గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ దివ్య, తదితరులు


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

● మహాత్మా.. మన్నించు!



అక్టోబర్ 2.. మహాత్మా గాంధీ జయంతి. దేశానికే పండుగ లాంటిది. ఏటా ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి అధికారులు పూల మాలలు వేసి నివాళులర్పిస్తారు. ఈ ఏడాది కొత్తపల్లి మండలంలోని అధికారులు గాంధీని మరిచిపోయారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బంది, ముసలిమడుగు, దుద్యాల గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్, సచివాలయ సిబ్బంది తప్ప.. మిగిలిన ఏ ఒక్క అధికారి కూడా గాంధీ జయంతిని నిర్వహించకపోవడం సిగ్గుచేటు. ఇక మందు, మాంసం నిషేధం ఉన్నా కూటమి ప్రభుత్వంలో విచ్చలవిడిగా లభ్యమవుతుండటంతో మందుబాబులు పూటుగా మద్యం తాగి రోడ్డుపై పడిపోయిన ఘటనలు చోటుచేసుకోవడం మహాత్ముడిని అవమానించినట్లేనని పలువురు పెదవి విరిచారు.

– కొత్తపల్లి

ముగిసిన దసరా పండగ




ఆకట్టుకున్న కళాకారుల వేషధారణలు, అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: దసరా ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశా యి. చివరి రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కాళికామాత, దేవతామూర్తుల విగ్రహాల రూపాల్లో భక్తుల విన్యాసాలు, ఆర్యవైశ్య మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి. కిసాన్ సింగ్ వీధిలో ఏర్పాటు చేసిన కనకదుర్గా విగ్రహాన్ని ఎస్ఆర్ఎంసీ కెనాల్‌లో నిమజ్జనం చేశారు.

ఉల్లిని పొలంలోనే వదిలేసిన రైతు

- బస్తాల్లో తీసుకెళ్లిన ప్రజలు

జూపాడుబంగ్లా: అధిక వర్షాలతో పాటు గిట్టుబాటు ధరల్లేక ఉల్లి రైతులు లబోదిబోమంటున్నారు. తంగడంచ గ్రామానికి చెందిన రైతు సుబ్బయ్య నాలుగు ఎకరాల్లో ఉల్లి సాగుచేశాడు. నూర్పిడి చేసుకుని మార్కెట్‌కు తరలిద్దామనుకునే సరికి వర్షాలు కురవటంతో పంట మొత్తం తడిచిపోయింది. అసలే ధరలేని సమయంలో తడిసిన ఉల్లిని ఎవరూ కొనుగోలు చేయరని, రవాణా ఖర్చులు అదనంగా అవుతాయని పొలంలోనే వదిలేసినట్లు రైతు వాపోయాడు. కాగా శుక్రవారం జూపాడుబంగ్లా వాసులు పొలం వద్దకు చేరుకుని ఉల్లిగడ్డలు బస్తాలకు వేసుకుని తీసుకెళ్లిపోయారు. ఎకరాకు రూ.80వేల చొప్పున నాలుగు ఎకరాలకు రూ.3.20లక్షల పెట్టుబడి పెట్టినా పైసా చేతికందలేదని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరాడు.


రైతు సుబ్బయ్య పొలంలో వదిలేసిన ఉల్లిగడ్డలను తీసుకెళ్తున్న ప్రజలు

ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వద్దు


ప్రజలకు సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

నందికొట్కూరు: ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయకుండా జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించుకోవాలని జిల్లా మలేరియా అధికారి చిమ్మె చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం కోటావీధి, ఎస్ఎస్ఆర్ నగర్‌లో డెంగీ కేసులు నమోదు కావడంతో జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో ఫ్రైడే, డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. మలేరియా, డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బేబి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు, జడ్డువారి పల్లె గ్రామాల్లో సర్పంచ్ షేక్ నాజియా శుక్రవారం వీధిలైట్ల ఏర్పాటు చేయించి, మురుగు కాల్వల శుభ్రం చేయించారు. ఎదురుపాడు ఎస్సీ కాలనీలో మురుగు కాలువ పూడిక తీయించి, జమ్ములమ్మ గుడి వద్ద చేతిపంపును ఏర్పాటు చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు రహంతుల్లా పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

పాములపాడు: భారత రాజ్యాంగంలోని లౌకిక సామ్యవాద పదాలను కేంద్ర ప్రభుత్వం తొలగించకుండా భారత రాజ్యాంగం పరిరక్షణకు కలిసి ఉద్యమించాలని జాతీయ మహానాడు నాయకులు నల్లమల్ల అబ్రహం కోరారు. శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీల ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో కడియం మాల మహానాడు రాష్ట్ర నాయకులు సాంబశివుడు, బీసీ సంఘం నాయకులు బత్తుల సంజీవ రాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి సోమన్న, కేవీపీఎస్ జిల్లా నాయకులు ఎం రాజు తదితరులు మాట్లాడుతూ లౌకిక, సామ్యవాద పదాలను రాజ్యాంగంలో నుంచి తొలగించవద్దంటూ ఈనెల 9న విజయవాడలో చేపట్టనున్న ధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు రామకృష్ణ, చౌడయ్య పాల్గొన్నారు.


జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రజా సంఘాల నాయకులు